సమావేశంలో మాట్లాడుతున్న అమరేందర్‌రెడ్డి

చిరుధాన్యాల ఉత్పత్తులతో మహిళ లకు స్వయం ఉపాధి

● కేవీకే డైరెక్టర్ ఘంటా అమరేందర్‌రెడ్డి

గరిడేపల్లి, ఏప్రిల్ 10 : చిరుధాన్యాల ద్వారా పలు రకాల ఉత్పత్తులను తయారు చేసి మహిళలు స్వయం ఉపాధిని పొందవచ్చునని కేవీకే డైరెక్టర్ ఘంటా అమరేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో గల కేవీకేలో షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలో భాగంగా షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలకు చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మూడు రోజులు కొనసాగే శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తదుపరి కేవీకే శాస్త్రవేత్త ఎన్.సుగంధి చిరుధాన్యాలతో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే విధానాలను వివరించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, గారకుంటతండాకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

గరిడేపల్లి : వెలిదండలో వెంకటేశ్వర్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అరుణోదయ సమాఖ్య నాయకులు

'కానూరి ఆశయ సాధనకు కృషి చేయాలి'

గరిడేపల్లి, ఏప్రిల్ 10 : అరుణోదయ సమాఖ్య వ్యవస్థాపకుడు వెంకటేశ్వర్‌రావు 9వ వర్ధంతిని అరుణోదయ సమాఖ్య మండలంలోని వెలిదండ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు చిత్రపటానికి సమాఖ్య జిల్లా నాయకుడు గండు నాగేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలను తొలగించేందుకు వెంకటేశ్వర్‌రావు పోరాటం మరువలేనిదన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్, నాయకుడు కామళ్ల శ్రీను, గ్రామ మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, రైతు కూలీ సంఘం నాయకుడు చింతమళ్ల అంజయ్య, సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : అరుణోదయ కళామండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కానూరి వెంకటేశ్వరావు వర్ధంతిని బుధవారం పట్టణంలోని లాల్‌బంగ్లాలో పీడీఎస్‌యూ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నూతనకల్ : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకుడు, కామ్రేడ్ కానూరి వెంకటేశ్వర్‌రావు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు దేశోజు మధు అన్నారు. మండల కేంద్రంలోని గునగంటి సత్యానారాయణ విజ్ఞాన కేంద్రంలో వెంకటేశ్వర్‌రావు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నెమలిపురి కళాజాతలో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి

చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

● ఎస్ఐ అనిల్‌రెడ్డి

కోదాడ రూరల్, ఏప్రిల్ 10 : విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కోదాడ రూరల్ ఎస్ఐ అనిల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి దొరకంట శివారు నెమలిపురి కాలనీ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలలో పోలీస్ కళాబృదం వారు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటర్‌నెట్‌ను సద్వినియోగం చేసుకుని తల్లిదండ్రులు, ఇతరులు సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా వారికి ఏటీఎం, ఓటీపీ వివరాలపై అవగాహన కలిగించాలని సూచించారు. అనంతరం కళాబృందం పలు సామాజిక అంశాలపై జానపద కళారూపాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.కవితా రాణి, జిల్లా షీ టీమ్ శివరాం, శ్రీనివాస్ రావు, వెంటకనారాయణ, చంద్రశేఖర్, యల్లయ్య, గోపి పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు : కౌన్సిలర్ సౌజన్య

హుజూర్‌నగర్, ఏప్రిల్ 10 : క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కౌన్సిలర్ చిలకబత్తిని సౌజన్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని గోవిందపురంలో అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి షటిల్ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ లయన్స్ అధ్యక్షుడు కోటి, కమిటీ సభ్యులు బండి భాస్కర్, రాజు, ప్రసాద్, రాజు, శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311823-All

CHANGE OF NAME
★ I, AFREEN ARA (Old Name), R/o. 5-10-96, Manyamchalka Street, Nalgonda Town Dist., TS. Changed My Name as AFREEN AARA (New Name), W/o. Mohammed Abdul Moqtadeer.
NT-339403

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు:
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
గ్రా: దర్గుపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | తొలుపునూరి : 9182777638

మొక్కల సంరక్షణకు షేడ్ నెట్లు

● నర్సరీల్లో పదో విడుత హరితహారానికి సిద్ధమవుతున్న మొక్కలు
● జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో 44.43 లక్షల మొక్కల పెంపకం

ముకుందాపురంలోని నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ విజయకుమారి

నేరేడుచర్ల, ఏప్రిల్ 10 : వేసవి దృష్ట్యా గ్రామాల్లో ఏర్పాటు చేసిన హరిత నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణకు అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ నిధులతో నర్సరీలు ఏర్పాటు చేసింది. ప్రస్తుతం ఆ నర్సరీల్లో ఉన్న మొక్కలు ఎండిపోకుండా అధికారులు చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో రానున్న 10వ విడుత హరితహారం కోసం 44,25,935 లక్షల మొక్కలను పెంచుతున్నారు. రోజు రోజుకు పెరిగిపోతున్న ఎండ తీవ్రతకు నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు అధికారులు, సిబ్బంది మొక్కలపై చలువ పందిళ్లు (షేడ్ నెట్లు) ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ కూలీల ద్వారా ఉదయం, సాయంత్రం వేళల్లో నర్సరీల్లోని మొక్కలకు నీళ్లు పట్టిస్తున్నారు.

నర్సరీలతో కూలీలకు ఉపాధి

మొక్కల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నారు. ఒక్కొక్క నర్సరీలో 10 నుంచి 18 వేల మొక్కల పెంపకం చేపట్టారు. గత జనవరి చివరి మాసం వరకు పాలిథిన్ కవర్లలో మొక్కల పెంపకం కోసం విత్తనాలను నాటడం జరిగింది. మొక్కలకు నీళ్లు పోసి వాటిని సంరక్షించడం కోసం వన సేవకుడిని నియమించి వారికి నిత్యం రూ.300 వేతనంగా చెల్లిస్తున్నారు. అంతే కాకుండా ఉపాధి కూలీలకు పాలిథిన్ కవర్‌లో మట్టి పోసి విత్తనాలు విత్తినందుకుగాను ఒక్కో బ్యాగ్‌కు రూ.1.10 చొప్పున చెల్లిస్తున్నారు. సుమారు 40 రోజుల కూలి గిట్టుబాటు అవుతున్నది.

చలువ పందిళ్లు

ఎండాకాలం మొక్కలు ఎండిపోవడం, ఎదుగుదల సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉండేందుకు ఎండ నుంచి మొక్కలను సంరక్షించేందుకు అధికారులు షేడ్‌నెట్లను ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే జూన్ చివరి మాసం నాటికి 10వ విడుత హరితహారం కోసం మొక్కలన్నింటినీ సిద్ధం చేస్తున్నారు. అప్పటి వరకు మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

కల్లూరు గ్రామ నర్సరీలోని మొక్కలకు నీళ్లు పోస్తున్న వన సేవకుడు

అధికారుల పర్యవేక్షణ

గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కల పెంపకాన్ని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా ఉండేందుకు పలు సూచనలు చేస్తున్నారు. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం ప్రణాళికయుతంగా పని చేస్తున్నారు. దానికి అనుగుణంగా మొక్కలను నర్సరీల్లో సిద్ధం చేస్తున్నారు.

మొక్కలు ఎండకుండా చర్యలు

వేసవికాలం సీజన్ కావడంతో మొక్కలు ఎండిపోకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సరీల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశాం. రోజూ మొక్కలకు ఉదయం, సాయంత్రం నీరు పట్టే విధంగా ఆదేశాలు జారీ చేశాం. జూన్ చివరి నాటికి హరితహారం కోసం మొక్కలను సిద్ధం చేయడం జరుగుతుంది.

– శేఖర్, ఏపీఓ, నేరేడుచర్ల

కీతవారిగూడెంలో బంగారం దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బంగారం దుకాణంలో చోరీ

● రూ.40 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

గరిడేపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల బంగారం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.40 వేల నగదు, రూ.2.60 లక్షల విలువైన బంగారు, వెండి అభరణాలను అపహరించుకుపోయినట్లుగా సమాచారం. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగింది. గరిడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బంగారు రాజేశ్ అనే వ్యక్తి గ్రామంలోని పశువుల దవాఖానకు పక్కన గల బిల్డింగ్‌లో కొన్ని నెలలుగా బంగారం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఉగాది పండుగ సందర్భంగా మంగళవారం దుకాణంను తెరవలేదు. ఇదే అదనుగా భావించిన దుండగులు మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో షెట్టర్‌ను ఇనుప రాడ్‌లతో తెరచి లోపలికి ప్రవేశించి షో కేస్ ట్రేలో ఉన్న నాలుగు జతల బంగారు మాటీలు, ఉంగరాలు, కొంత మొత్తంలో వెండితో పాటు కౌంటర్‌లో ఉన్న రూ.40 వేల నగదును అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దుకాణాన్ని హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, గరిడేపల్లి ఎస్ఐ సైదులు పరిశీలించి క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలను సేకరించారు.

నోటుకు ఓటు అమ్ముకోవద్దంటూ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జై భారత్ ఉద్యమ నాయకులు

నోటుకు ఓటు అమ్ముకుంటే భవిష్యత్ అధోగతే

● జై భారత్ ఉద్యమ నాయకులు

బొడ్రాయిబజార్, ఏప్రిల్ 10 : ఎన్నికల్లో నోటుకు ఓటు అమ్ముకుంటే మరో ఐదేండ్ల పాటు మోసపోవడం ఖాయమని జై భారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్జాసి లోక్‌నాథ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో డబ్బుకి ఓటు అమ్ముకుంటే బతికున్న శవంతో సమానమంటూ పోస్టర్లను ఆవిష్కరించి ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలతో సంబంధం లేకుండా పోటి చేసే అభ్యర్థుల నైతిక ప్రవర్తన, అర్హత, నిబద్ధత, సమర్థత ఉన్న అభ్యర్థినే ఎన్నుకోవాలని కోరారు. ఎన్నికల్లో రాజకీయ నాయకుల ధన ప్రలోభాన్ని, ఓట్ల కొనుగోలును ఎండగడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటర్ల బాధ్యతను చాటి చెబుతూ జై భారత్ ఉద్యమం ఆధ్వర్యంలో జై భారత్ జస్ట్ ఓట్ క్యాంపెయిన్‌ను తెలంగాణ వ్యాప్తంగా ఉధృతంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జై భారత్ ఉద్యమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోల సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కోటయ్య, బీసీ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రామన్న, నాయకులు అశోక్‌గౌడ్, సంజయ్, రాము, ఎస్సీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షురాలు సరిత, తగుళ్ల జనార్ధన్, చామకూరి నర్సయ్య, యాకయ్య పాల్గొన్నారు.

నిరుపేద ముస్లింలకు సరుకులు పంపిణీ

హుజూర్‌నగర్, ఏప్రిల్ 10 : రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని సీతారాంనగర్‌లో పేద ముస్లింలకు ఓపెన్ ఐస్ సొసైటీ ద్వారా రూ.10 వేల విలువ గల బియ్యం, ఇతర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సులువ శ్రీనివాస్, అబ్దుల్ మజీద్, చందు, శివ, శంకర్, లక్ష్మణ్, కృష్ణ, సంపత్, రమేశ్, చంటి, హమ్మద్, పాష, సైదా పాల్గొన్నారు.

పేద ముస్లింలకు సరుకులు పంపిణీ చేస్తున్న ఓపెన్ సొసైటీ సభ్యులు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

బీజేపీని చిత్తుగా ఓడించాలి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

అర్వపల్లి, ఏప్రిల్ 10 : ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేట్ పరం చేస్తూ, ప్రజలపై భారాలు మోపుతూ, దేశ సమైక్యత సమగ్రతను దెబ్బతీస్తూ, భారత రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ మనువాద సిద్ధాంతాలను అమలు చేయాలని చూస్తున్న బీజేపీని జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా చిత్తు చిత్తుగా ఓడించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు ప్రజలను కోరారు. బుధవారం స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి ఎం.డి.జహంగీర్ గెలుపును కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల మూలంగా నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలు కొని తినే పరిస్థితిలో లేరన్నారు. గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కూలీల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా ఒక్కటై బీజేపీని ఓడించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, సైదులు, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు రమేశ్, జగదీశ్, మండల కార్యదర్శి వజ్జ శ్రీనివాస్, బూర శ్రీనివాస్, సత్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 10 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన పట్టణ పరిధిలోని పిల్లలమర్రి గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి ఇరుగు మల్లేశ్ (22) బైక్‌పై సూర్యాపేట నుంచి పిల్లలమర్రికి వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో మల్లేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మల్లేశ్ (ఫైల్ ఫొటో)

నాగారం : ఈటూరులో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ రమ్యతేజ

నూతనకల్ : పెదనెమిల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ మౌనిక

ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

● ఏఈఓ మౌనిక

నూతనకల్, ఏప్రిల్ 10 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని ఏఈఓ మౌనిక నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని పెదనెమిల ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. రైతులు పండించిన పంటను మిషన్లతో కోసిన వెంటనే ఐకేపీ కేంద్రాలకు తీసుకురావొద్దన్నారు. ఒకటి రెండు రోజులు ఆరబెట్టి తేమ శాతం తగ్గిన తర్వాతే తీసుకరావాలని సూచించారు. ధాన్యంలో తాలు, తప్ప లేకుండా చూసుకోవాలన్నారు. తూకంలో మోసం లేకుండా సరిగ్గా ధాన్యాన్ని తూకం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో సీసీ ముత్తయ్య, భవాని పాల్గొన్నారు.

నాగారం : రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలని ఫణిగిరి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వ్యవసాయ విస్తరణ అధికారి మాచర్ల రమ్యతేజ అన్నారు. మండలంలోని ఫణిగిరి, ఈటూరు, మామిడిపల్లి గ్రామంలో తిరుమలగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ ప్రభుత్వం అందించే మద్దతు ధర ఏ గ్రేడ్ రూ.2,203, బి గ్రేడ్ రూ.2,183 పొందాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.

తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు రెండ్రోజులు సెలవు

తిరుమలగిరి, ఏప్రిల్ 10 : తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్‌కు రెండు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా గురు, శుక్రవారం సెలవులు ఉన్నందున రైతు సోదరులు 13వ తేది శనివారం ఉదయం 5 నుంచి 10 గంటల వరకు మాత్రమే మార్కెట్‌కు సరుకులు తీసుకరావాలని కోరారు.

ఆవుల అక్రమ తరలింపు పట్టివేత

మునగాల, ఏప్రిల్ 10 : ఆవులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం జరిగింది. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాల వద్ద గల జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఓ వాహనాన్ని పరిశీలించేందుకు దగ్గరకు రాగా పోలీసులను చూసి వాహనంలో ఉన్నవారు పరుగులు తీశారు. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వాహనాన్ని పరిశీలించగా 4 ఆవులు, 5 ఎడ్ల తరలింపును గుర్తించారు. స్వాధీనం చేసుకున్న గోవులను జియాగూడ గోశాలకు తరలించారు. వాహనాన్ని సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నాగారం ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఎన్నిక

నాగారం, ఏప్రిల్ 10 : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి దేవాలయ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా కన్నెబోయిన సంజీవ, ఉపాధ్యక్షుడిగా నూకా నరేశ్, కోశాధికారులుగా ఆకారపు శ్రీను, అనిల్, ప్రధాన కార్యదర్శులుగా కూరం వెంకన్న, సతీశ్, గౌరవ సలహాదారులుగా మంగదుడ్ల దశరథ, అంజయ్య, యాదగిరి, శివాజీను ఎన్నుకున్నారు. దేవాలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని కమిటీ సభ్యులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మూసీఒడ్డు సింగారం పాఠశాలలో విద్యుదీకరణ పనులు

పాలకవీడు, ఏప్రిల్ 10 : మండలంలోని మూసీఒడ్డు సింగారం ప్రాథమిక పాఠశాలలో విద్యుదీకరణ పనులు ప్రాంభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోప బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పనులు పర్యవేక్షించబడుతాయని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవసరమైన మేరకు ఫ్యాన్లు, బల్బులు, ట్యూబ్‌లైట్లు, తాగునీటికి విద్యుత్ మోటర్లు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు యూసుఫ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలలో విద్యుదీకరణ పనులను ప్రారంభిస్తున్న హెచ్ఎం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు

ఆర్థిక సాయం

అర్వపల్లి, ఏప్రిల్ 10 : మండలంలోని కొమ్మాల గ్రామానికి చెందిన కోనేటి సతీశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సతీశ్ సూర్యాపేటలోని వెంకట లక్ష్మి హీరో హోండా షోరూంలో అసిస్టెంట్ మెకానిక్‌గా పనిచేసేవాడు. దాంతో సతీశ్ కుటుంబ సభ్యులను షోరూమ్ అధినేత రాచర్ల కమలాకర్ పరామర్శించి తనవంతుగా రూ.30 వేలు, మెకానిక్‌ల తరపున రూ.20వేలు, తోటి మెకానిక్‌లు కలసి రూ.20 వేలు మొత్తం రూ.70 వేలు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ నాగేందర్, మెకానిక్‌లు పాషా, సోమేశ్, శ్రీను, రమేశ్, విక్రమ్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న మేనేజర్ నాగేందర్

మట్టపల్లి గోశాలకు గడ్డి అందజేత

నేరేడుచర్ల, ఏప్రిల్ 10 : మట్టపల్లి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మి గోశాలకు నేరేడుచర్లకు చెందిన నూకల శ్రీనివాస్‌రెడ్డి, కొణతం వెంకట్‌రెడ్డి రెండు ట్రాక్టర్ల గడ్డిని బుధవారం అందజేశారు. గోమాతలకు పశుగ్రాసం లేక ఇబ్బందులు పడుతున్నాయని తెలుసుకుని స్వయంగా ట్రాక్టర్ ఖర్చులను భరించి తీసుకువెళ్లి గోశాలకు గడ్డిని అందజేశారు.

గోశాలకు గడ్డిని విరాళంగా అందజేస్తున్న నేరేడుచర్ల రైతులు